ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 జూలై 2024



ఏలూరులో రూ.7000 వేలు పింఛన్ అందుకున్న ఆనందంలో అవ్వ

బాబు.. బంగారం





నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించి లాంఛనంగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

పెరిగిన పింఛన్‌తో పేదల్లో ఆనందం

- ఊరు వాడా.. తెల్లవారుజాము నుంచే పండుగ ఆరంభం
- పెరిగిన పింఛన్‌లతో ఆనందంతో కొందరు నృత్యాలు.. మరికొందరు పాదాభివందనాలు
- నూజివీడులో పింఛన్ల పంపిణీ ప్రారంభించిన మంత్రి పార్థసారథి.. కలెక్టర్
- నియోజక వర్గాల్లో పంపిణీలో ఎమ్మెల్యేలు

వలంటీర్ల హడావిడి లేదు.. రోజు ముందుగానే ఆర్భాటం లేదు.. పింఛన్ కోసం మూడు రోజులు వెయిట్ చేయ నక్కర్లేదు.. కూటమి ప్రభుత్వంలో పింఛన్‌ల పంపిణీ ఒక పండుగలా సాగింది. పేద జనం చిరు నవ్వులు ఆత్మీయ ఆలింగనాలు, పాదాభివందనాలు, పాలాభిషేకాలు, పూల జల్లుల మధ్య అట్టహాసంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు పంపిణీ సాగింది. పింఛన్ అందుకున్న వారిలో అత్యధికులు కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటామంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

– ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

వలంటీర్లు లేకుండానే..

గత ఐదేళ్లు వలంటీర్ల కనుసన్నలలోనే పింఛన్ పంపిణీ సాగింది. వృద్ధులు, వితంతువులతో పాటు వేలాది మందికి పింఛన్ ఇవ్వడమే ఒక అరుదైన చర్యగా అప్పట్లో ఒక సీన్ క్రియేట్ చేసి మరి అందించేవారు. మంచం పట్టిన రోగులకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏకంగా 15 వేల వరకు అందించగా అప్పట్లో 7 వేల రూపాయలు దక్కేది. ఇలా ఒకటేంటి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 68 వేల 358 వేల మంది పింఛన్ దారులుండగా వీరందరికీ 7 వేలు చొప్పున పింఛన్ చేతికందింది. సోమవారం తెల్లవారుజాము నుంచే ఈ ప్రక్రియ ఆరంభించారు. సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు శనివారం రాత్రికే బ్యాంక్‌ల్లో నగదు అందుకుని సోమవారం వేకువజామున రంగంలోకి దిగారు. ఎలాంటి తడబాటు లేకుండా వలంటీర్లు లేకున్నా పింఛన్‌లు పంపిణీ చకచక సాగించారు. ఎక్కడా పింఛన్ దారుల పట్ల విసుగు చూపకుండా గౌరవప్రదంగా వ్యవహరించారు. గడిచిన మూడు నెలల బకాయిలు కలిపి రూ.7 వేలు చొప్పున ఒక్కొక్కరికి పింఛన్ అందించడం పేదల్లో సంతోషం నింపింది. అన్ని కుటుంబాల్లోనూ ఆనందం వెల్లివెరిసింది. వాస్తవానికి గతంలో పింఛన్ అందుకోవాలంటే వలంటీర్లు చెప్పినట్లు వినాల్సిందే. ఎవరైనా ఎదురు తిరిగి మాట్లాడితే వారికి నరకం కనపడేది. కూటమి ప్రభుత్వంలో సోమవారం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ సాఫీగా సాగింది. పెరిగిన పింఛన్ పేదల మనస్సు మురిసేలా చేసింది. అందుకనే వారంతా మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేలకు తమ కృతజ్ఞతలు తెలుపుతూ వారిని పొగడ్తలతో ముంచెత్తారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పింఛన్‌లు పంపిణీలో అధికారులతో పాటు పాల్గొన్నారు. ప్రత్యేకించి వయో వృద్ధులు, మంచం పట్టిన వారు తలసేమియా పక్షవాతంతో బాధ పడుతున్న వారందరికీ పింఛన్‌లను దగ్గరకు వెళ్ళి మరీ అందించారు. ఇప్పటికే కిడ్నీ వ్యాధులతో బాధ పడుతున్న డయాలసిస్ రోగులను పలకరించి పింఛన్‌లు అందించారు. ఎక్కడికక్కడ పింఛన్ పంపిణీని ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షిస్తూ వచ్చారు.



చంద్రబాబుకు రుణపడి ఉంటాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ రూ.4 వేలకు పెంచి, బకాయి రూ.3 వేలుతో కలిపి రూ.7 వేలు ఒకటో తేదీనే ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. పెన్షదారుల జీవితాల్లో చంద్రబాబు వెలుగులు తీసుకొచ్చారు. ఇంత గొప్ప మేలు చేసిన చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటాం.

– బొమ్మిడాల నాగమణి, చాట్రాయి



తప్పిన పింఛన్ తిప్పలు

సీఎం చంద్రబాబు పింఛన్ పెంపుతో వృద్ధులు, దివ్యాంగులు సమాజంలో తలెత్తుకుని జీవించేలా చేశారు. పెంచిన సొమ్ముతో ఇబ్బందులు లేకుండా గడపడానికి వీలు ఏర్పడుతుంది. జీవితం చివరి దశలో ఉండి, కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని వారికి సామాజిక పింఛన్ పెంపు చారిత్రాత్మక నిర్ణయం.

– మేకల వెంకట రమణ, ఏలూరు



చంద్రబాబు మాకు దేవుడు

తెలుగుదేశం ప్రభుత్వం పింఛన్ పెంచడం, రూ.7వేలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. నేను ఎక్కడికి వెళ్ళాల్సిన అవసరం లేకుండా పింఛన్‌తోనే జీవించవచ్చు. చంద్రబాబు మాకు దేవుడు. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– ఇందిరాదేవి, శనివారపుపేట



ఏలూరులో నాయకుల ఫొటోలకు ఆనందంతో పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

నా పింఛన్‌ను అభివృద్ధికి వినియోగించండి..

నా పింఛన్ సొమ్ము ఈ రాష్ట్ర అభివృద్ధికి విరాళంగా ఇస్తున్నా...సీఎం చంద్రబాబు నాయుడు పేద ప్రజలు మట్ల కనికరం చూపారు. మాలాంటి వారు ఎంత మందినో చూసి మనసున్న నేతగా పింఛన్‌లు పెంచడమే కాకుండా గత మూడు నెలల పింఛన్‌లతో కలిసి ఏడు వేలు మాకు అందిస్తున్నారు. ఈ 7 వేల రూపాయలు కాదు మరో 3 వేలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి విరాళంగా ఇస్తున్నానని కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన పింఛన్‌దారు పద్మావతి ప్రకటించారు. దీంతో ఆమెకు పింఛన్ ఇచ్చేందుకు వెళ్ళిన కూటమి నేతలు పద్మావతిని అభినందనలతో ముంచెత్తారు.

- చింతలపూడి మండలం వెలగలపల్లిలో తాళ్ళూరి నారాయణరెడ్డి అనే వృద్ధుడు తనకు అందించిన పెన్షన్ సొమ్ము రూ.7 వేలకు మరో రూ.116 కలిపి అమరావతి రాజధాని నిర్మాణ నిధి కింద అందించాలని ఎమ్మెల్యే రోషన్‌కు అందజేశారు. దీనిక ఎమ్మెల్యే రోషన్ స్పందించి నారాయణరెడ్డి లాంటి మనస్సున్న నేతలు ముందుకు వస్తే అమరావతి రాజధాని నిర్మాణం సాధ్యమవుతుందని, వీరితో పాటు ఇంకా ఎవరైనా ముందుకు వస్తే ఆ ఇచ్చే దాతల సహాయాలు కలిపి ఒకేసారి రాజధాని నిధికి పంపిస్తామని ప్రకటించారు.



తడికలపూడిలో రాష్ట్ర అభివృద్ధికి విరాళం అందిస్తున్న పెన్షన్‌దారు పద్మావతి

నూజివీడులో మంత్రి కొలుసు ప్రారంభం

పింఛన్‌ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాలు పంచుకున్నారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి నూజివీడు నియోజక వర్గంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రి సెల్వితో కలిసి లాంఛనంగా ఆరంభించారు. పేద వర్గాలకు ఏ మాట ఇచ్చారో ఆ మేరకే పింఛన్‌లు పెంచి మీకందరికి ఇస్తున్న ఘనత సీఎం చంద్రబాబు దేనని ఇక ముందు కూడా సంక్షేమం కొనసాగుతుందని పేదల ఇళ్లకే వచ్చి పింఛన్ అందిస్తారని స్పష్టం చేశారు. ఎక్కడ లోటు పాట్లు లేకుండా చూడాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దెందులూరు నియోజక వర్గం పెదపాడులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్, కలెక్టర్, ప్రజల హర్షధ్వానాల మధ్య ఆరంభించారు. రోడ్లన్నీ పూలతో నిండి పోయాయి. పేదల సంక్షేమాన్ని ప్రతీ కార్యక్రమం విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి కూడా కలెక్టర్ వెంట రాగా ప్రజలకు పింఛన్ అందించారు. ఏలూరు నగరమంతటా అన్ని వార్డుల్లోనూ తెల్లవారుజాము నుంచే పింఛన్ సందడి ఆరంభమైంది. ప్రత్యేకించి సచివాలయ సిబ్బంది అప్రమత్తం కావడం చకచక పంపి ణీ చర్యలు తీసుకోవడంతో తొలి మూడు గంటల్లోనే 40 శాతం పింఛన్‌లు పంపిణీ పూర్తి అయ్యింది. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని ఆంజనేయు లుతో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ నేతృత్వంలోనూ పోలవరంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నేతృత్వంలో పింఛన్‌లు పంపిణీ ఆర్భాటంగా సాగింది.



ముసునూరు మండలం గుడిపాడులో సన్నాయి మేళాలతో ర్యాలీగా వెళ్లి పెన్షన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు





లింగపాలెంలో చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్.. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి పెన్షన్ల అందజేత



పెదపాడు మండలం కొత్తూరులో పింఛను అందజేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెట్రి సెల్వి



ద్వారకా తిరుమలలో పింఛను పంపిణీ చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



జీలుగుమిల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



భీమడోలు మండలం కురేళ్ళగూడెంలో పింఛన్ సొమ్ము అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

కలెక్టర్ ముందు చూపు

జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్వి పింఛన్‌లు పంపిణీలో పక్కా ప్రణాళిక అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు పూర్తిగా అప్రమత్తం అయ్యి ఎక్కడికక్కడ యంత్రాంగాన్ని గాడిలో పెట్టారు. పింఛన్‌ల సొమ్ము శనివారం సాయంత్రానికే సంబంధిత అధికారులకు బ్యాంక్‌ల ద్వారా అందేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకించి నగదు పక్కాగా అందుబాటులో ఉండేలా జాగ్రత్త వహించారు. శనివారం అంతా పింఛన్‌లు పంపిణీకి సంబంధించి సుదీర్ఘ కసరత్తు కలెక్టర్ చేశారు. పర్యావసానంగా బ్యాంకర్‌లు, కలెక్టర్ ఆదేశాలు మేరకు ముందుగానే ఆయా బ్రాంచిలలో తగినంత నగదు నిల్వలు ఉంచుకుని ఆ మేరకు సంబంధిత అధికారులకు అందించగలిగారు. ఇంతకుముందు బ్యాంక్‌లో నగదు కోవడానికే వలంటీర్లు ముప్పు తిప్పలు పడేవారు. కాని ఆ పరిస్థితి పునరావృతం కాకుండా కలెక్టర్ కొంత సీరియస్‌గా వ్యవహరించారు. ఒకవైపు నియోజకవర్గ స్థాయిలో అధికారు లు పర్యవేక్షించేలా చేయడం పింఛన్‌లు పంపిణీ రోజు అయిన సోమవారం తానే స్వయంగా మంత్రి, ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీలో పాల్గొనడంతో కలెక్టర్ పరోక్షంగా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. సోమవారం ఉదయాన్నే సర్వర్ డౌన్‌తో దాదాపు 5 వేల మంది సిబ్బంది గంట పాటు ఎక్కడికక్కడ నిలిచిపోయిన క్షణంలోను వారందరికీ ఎప్పటికప్పుడు తక్షణ ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారు. రాత్రి పొద్దు పోయేంత వరకు పంపిణీ కొన సాగుతున్న తీరును మిగతా అధికారులతో కలిసి పర్యవేక్షిం చారు. రాత్రి 8 గంటల సమయానికి 174 కోట్ల రూపాయలు అందజేయగలిగారు. మరో రూ.8 కోట్లు పంపిణీ జరిగేలా సిబ్బందిని అప్రమత్తం చేయగలిగారు.

నేతలకు పాలాభిషేకాలు

పింఛన్‌లు అందుకున్న వారంతా తమకు కృతజ్ఞతతో ఏదో రూపంలో వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. స్థానిక ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కార్యాలయం లో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు కార్యకర్తలు పాలా భిషేకం చేశారు. పేదల పక్షాన నిలిచి వారికి ఇచ్చిన మాట మేరకు పింఛన్‌లు పెంచి పంపిణీ చేసిన ఘనత చంద్ర బాబుదేనని ఎంపీ మహేష్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. దీంతో పాటు పోలవరం దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లోనూ స్థానికులు ఎక్కడికక్కడ నేతలను పూలతోనూ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలతోనూ ముంచెత్తి అభిమానం చాటుకున్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

- కలెక్టర్ వెట్రిసెల్వి.. 164 అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, జూలై 1 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) అర్జీల పరిష్కారంపై సవివరమైన వివరణ ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' జిల్లాస్థాయి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో డి.పుష్పమణి, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆర్డీవో ఖాజావలీ కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో అర్జీలను పరిష్కరిస్తే అర్జీదారుడికి మేలు జరుగుతుందన్నారు. మొత్తం 164 అర్జీలు స్వీకరించారు. రెవిన్యూ, పౌరసరఫరాలు, రీసర్వే, పోలీస్, భూవివాదాలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్య సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తమ స్థలం ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పెదపాడు మండలం వట్లూరుకు చెందిన మల్లీశ్వరి కోరారు. తమ స్థలాన్ని ఆక్రమించుకుని పశువుల పాకలను ఏర్పాటుచేసి ఇంటికి వెళ్ళే దారి మార్గం లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నిడమర్రుకు చెందిన లక్ష్మీ ఫిర్యాదు చేశారు. తనకు సంపూర్ణ గృహహక్కు పథకం అందజేయాలని చింతలపూడికి చెందిన పద్మావతి కోరారు.
- వైసీపీ నాయకులు ప్రోద్బలంతో తనకు పింఛన్ తొలగించారని, పింఛన్ ఇప్పించాలని భీమడోలుకు చెందిన పడాల రాంబాబు వినతిపత్రం అందజేశారు. తన రెండు కాళ్ళు పని చేయవని, పింఛన్ రాక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపాడు.
- వైసీపీ నాయకులు కొందరు అధికారులను బెదిరించి, తనకు ఉన్న స్థలాన్ని వేరేవారికి డిఫాం పట్టా రాయించారని, ముదినేపల్లి మండల చిగురుకోటకు చెందిన భూపతికోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తాను చిగురుకోటలో నివాసం ఉంటుండగా, తన తాతకు చెందిన 83 సెంట్లు ఉందని, కాలక్రమేణా కొంతమంది వ్యక్తులు వైసీపీ నాయకుల ప్రోద్బలంతో స్థలం ఆక్రమించు కున్నారని, రికార్డులు పరిశీలన చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

• ఆదరణ లబ్ధిదారుల ఆందోళన

బీసీ వర్గాల్లో చేతివృత్తుల వారికి టీడీపీ హయాంలో ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతో ఆదర్శంగా అమలు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల ఈ పథకాన్ని ఆపేసింది. అయితే ఆదరణ పథకానికి దరఖాస్తు చేసుకుని నగదు చెల్లించినా పనిముట్లు ఇవ్వలేదని, న్యాయం చేయాలంటూ దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలంలోని సుమారు 500 మంది లబ్ధిదారులు సోమవారం కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. గ్రామంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 2018లో యూనిట్లకు సంబం ధించి లబ్ధిదారు వాటాను చెల్లించామని పలువురు పేర్కొన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2019లో పెదవేగి మార్కెట్ యార్డు గొడౌన్‌లో ఆదరణ పథకాల పనిముట్లు పంపిణీ చేసినా తమకు ఇవ్వలేదని, తాము చెల్లించిన లబ్ధిదారుని వాటా సొమ్ము తిరిగి వెనక్కి ఇవ్వలేద న్నారు. అప్పట్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అర్హత లేని వారికి, లబ్ధిదారుల వాటా కట్టని వారికి ఇచ్చారని ఆరోపిం చారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



డయేరియాపై అవగాహన కల్పించండి

ఏలూరు సిటీ, జూలై 1 : ప్రజలకు డయేరియాపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, పల్లెల్లో, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలు జరిగేలా, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం ప్రాంగణంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ జింక్ కార్నర్ స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్‌డీసీ కార్యక్రమాల వివరాలను డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.శర్మిష్ఠను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పారిశుద్యం చేపట్టి జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జరిగే స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సంబంధిత వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ జింక్ కార్నర్ స్టాల్ వద్ద ఉన్న అంగన్‌వాడీ చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. అనంతరం మహిళలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. జేసీ లావణ్య వేణి, డీఆర్వో పుష్పమణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.వియజరాజు, ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్ ఖాజావలి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎస్పీ ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు క్రైం, జూలై 1 : సోషల్ మీడియా మాధ్యమాల్లో అపరిచితులు పంపించే లింకులు కాని, మెస్సేజ్‌లను కాని ఓపెన్ చేయవద్దని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో 60 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని చట్ట ప్రకారం సత్వర పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు ఫోన్‌లో జారీ చేశా రు. ఎస్పీ మాట్లాడుతూ ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కొంతమంది సైబర్ నేరగాళ్ళు ఫోన్ చేసి వెనక్కు వచ్చిన డబ్బులు అకౌంట్‌లో ఉన్నాయని బ్యాంక్ అకౌంట్ చెక్ చేసుకోవాలని చెప్పి మాయమాటలతో లింకులు పంపిస్తున్నారని ఆ లింకులను ఓపెన్ చేస్తే బ్యాంక్ అకౌంట్ సొమ్ము అంతా క్షణాల్లో ఖాళీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కొనసాగుతున్న వర్షాలు

- పోలవరం మండలంలో 42 మిల్లీ మీటర్ల వర్షపాతం
- జిల్లాలో సార్వా పనులు ముమ్మరం

ఏలూరు సిటీ, జూలై 1 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి రోజురోజుకు బలపడుతోంది. ఈ కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీగానే వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతారణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వర్షాల రాకతో సార్వా పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడిన తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావం ఎక్కువగానే కనిపిస్తోంది. అయితే ఇప్పుడు కూడా జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. పగటి పూట మబ్బుల వాతావరణం ఉండి అక్కడక్కడా తేలిక పాటి వానలు కురుస్తుండగా, మరికొన్ని చోట్ల ఎండ ప్రభావం కనిపిస్తోంది. రాత్రి సమయాల్లో మాత్రం ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో వారం రోజులుగా ఇదే పరిస్థితి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 42 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 8 మి.మీ నమోదైంది. జంగారెడ్డిగూడెం 25.4, బుట్టాయిగూడెం 17.2, కొయ్యల గూడెం 15.6, పెదవేగి 14.2, వేలేరుపాడు 13, టి.నరసాపురం 12, లింగపాలెం 9.6, ముదినేపల్లి 9.2, కామవరపుకోట 7.2, చింతలపూడి, జీలుగుమిల్లిలలో 7, కలిదిండి 5.8, ముసునూరు, ద్వారకాతిరుమలలో 5.4, మండవల్లి 4.4, కుక్కునూరు 4.2, నూజివీడు 3.6, కైకలూరు, చాట్రాయి, భీమడోలులలో 2.6, పెదపాడు, ఏలూరు అర్బన్‌లలో 1.8, దెందులూరు, ఉంగుటూరులలో 1.6, నిడమర్రు 1.2, ఏలూరు రూరల్ 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఓపెన్ దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాల విడుదల

ఏలూరు అర్బన్, జూలై 1 : ఏపీ ఓపెన్‌స్కూల్స్ టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ/పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 692 మంది హాజరుకాగా, వీరిలో 64 మంది (9.25 శాతం), ఇంటర్ పరీక్షలకు 1080 మంది హాజరుకాగా, వీరిలో 602 మంది (55.74శాతం) ఉత్తీర్ణులయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నిర్ణీత ఫీజు చెల్లించి ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తత్కాల్ స్కీంలో పరీక్ష ఫీజు చెల్లించిన వారిని పబ్లిక్ పరీక్షల విద్యార్థులుగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైన వారికి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించిన విషయం విదితమే.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు ప్రారంభం

తొలి రోజు ప్రత్యేక కేటగిరిలో 48 మంది సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, జూలై 1: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌కు అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం నుంచి ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. తొలి విడతగా ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను అధికారులు నిర్వహించారు. సైనిక సంతతి విభాగానికి చెందిన 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సైనిక సంతతి విభాగం కేటగిరిలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

హెచ్‌ఎంలకు టెక్ టూల్ పై శిక్షణ

ఏలూరు రూరల్, జూలై 1: నూతనగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా విద్యారంగంలో సపోర్టింగ్ ఆంధ్రా, లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా హైస్కూల్, యూపీ పాఠశాల హెచ్‌ఎంలు, సీఆర్పీలకు ఈ నెల 10 వరకు టెక్ టూల్ పై శిక్షణ అందజేస్తుంది. దీనిలో భాగంగా ఏలూరులో సోమవారం శిక్షణ ప్రారంభమైంది. ఎంఈవో-2 రంగయ్య శిక్షణ ప్రారంభించారు. ఏలూరు జిల్లా ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఎడ్యుకేషనిస్ట్‌తో ఈ కార్యక్రమం రూపకల్పన చేయటం జరిగిందని తెలిపారు. ఇది ఆంధ్రాలో అమలు చేయటం గమనార్హం అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎమ్ఎల్పీ టెక్ టూల్ శిక్షణకు సంబంధించిన నిబంధనలు వివరించారు.

• భలే చెప్పారు.. బహుమతి గెలుచుకున్నారు



ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోల్స్‌లో సరిగా అంచనా వేసి.. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి సోమవారం తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బహుమతి ప్రదానం జరిగింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 'ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుంది?' ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కూపన్లను పూరించి పాఠకులు పంపించారు. వీటిలో 15 స్థానాలు కూటమి గెలుస్తుందని అంచనా వేస్తూ పెద్ద సంఖ్యలో కూపన్లు వచ్చాయి. వీటిని జూన్ 5న లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. వీరిలో మొదటి విజేత గడియాకుల శ్రీనివాసరావు తరఫున శ్రీదేవి రూ.10 వేలు, ద్వితీయ విజేతలుగా మద్దిపాటి సుబ్బారావు, సీహెచ్ అలివేణి, చిటికెల అప్పారావులకు ఐదు వేల చొప్పున బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు అందజేశారు.

పిల్లలకు బైక్‌లు ఇచ్చారో..

ఇక జైలుకే..

అమల్లోకి కొత్త రవాణా చట్టం.. తస్మాత్ జాగ్రత్త



ద్వారకా తిరుమలలో చెలరేగిపోతున్న బాలలు

బైక్‌లు ఇస్తున్న తల్లిదండ్రులు.. పట్టని అధికారులు

మావాడు సెవన్త్ క్లాస్..
అప్పుడే బైక్ నడుపుతాడు తెలుసా ?
- ఓ తండ్రి గర్వంగా చెబుతాడు.
మా పాప నైన్త్ చదువుతోంది. నన్ను స్కూటీపై ఆఫీస్ దగ్గర డ్రాప్ చేస్తుంది.
- ఓ తల్లి సంతోషం.

పిల్లలు వయసుకు మించి ఎదిగిపోతున్నారని.. పెద్ద పెద్ద బళ్లు నడిపేస్తున్నారని తల్లిదండ్రులు సంతోష పడుతుంటారు. కానీ మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. వారు డ్రైవింగ్ ఎంత బాగా నేర్చుకున్నా.. వారి వయసు, పరిణితి వాహనాలు నడపడానికి సరిపోవని మోటార్ వెహికల్ యాక్ట్ చెబుతోంది. కాని, అన్నీ తెలిసి ద్వారకా తిరుమల మండలంలో మైనర్లు మాత్రం బైక్‌లపై రయ్‌రయ్‌మంటూ పరుగులు తీస్తున్నారు.

ద్వారకా తిరుమల, జూలై 1 : ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, నిబంధనలు విధించినా.. తగ్గేదేలే అంటున్నారు.. ఇక్కడి మైనర్లు. రవాణా శాఖ రూల్స్ మార్చింది కానీ.. పిల్లల తల్లిదండ్రుల మనస్సులను మార్చలేకపోతోంది. పిల్లలకు యథేచ్ఛగా ద్విచక్ర వాహనాలను ఇచ్చేసి పట్టించుకోకపోవడంతో వారు రయ్.. రయ్‌మంటూ బైక్‌లపై హల్‌చల్ చేస్తున్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి స్పీడుకు బ్రేకులు పడటం లేదు. పిల్లలను పబ్లిక్ రోడ్లపై డ్రైవింగ్‌కు అనుమతించడం ద్వారా తల్లిదండ్రులు వారి జీవితాలకే కాకుండా ఇతర వాహనదారుల జీవితాలకూ ప్రమాదం కల్గిస్తున్నారు. మైనర్‌లు బైక్ రైడ్ చేస్తే వారికి రూ.25 వేలు జరిమానా విధించాలని రవాణా శాఖ నిబంధనలను సవరించింది. వీటిని జూన్ ఒకటి నుంచి అమలు చేస్తోంది. మైనర్లు బైక్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వారికి 25 ఏళ్లు వచ్చే వరకూ డ్రైవింగ్ లైసెన్స్‌కు అనర్హులుగా ప్రకటించారు. వాహన యజమాని రిజిస్ట్రేషన్ కార్డు (ఆర్‌సీ)ను రద్దు చేస్తారు. వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారుల తాజా ఆదేశాలున్నా.. వాటిని పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో మైనర్లు ఇష్టానుసారంగా వాహనాలను నడిపేస్తున్నారు. వీరికి బండి దొరికితే చాలు అన్నట్టుంది. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఏ1గా వాహనయజమాని, ఏ2గా బండి నడిపిన మైనరుపై కేసు నమోదు చేయాల్సి ఉంది. రహదారి భద్రతపై సుప్రీం కోర్టు కమిటీ సూచనల ప్రకారం రాష్ట్ర రవాణా అథారిటీ ఇటీవల ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇద్దరు వ్యక్తులూ హెల్మెట్ ధరించడం తప్పనిసరని నిబంధనలను విధించింది. హెల్మెట్ లేకుండా రైడర్స్ పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించింది.

మోటారు వాహనాల(సవరణ) చట్టం 2019

మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు 2019, సెక్షన్ 199(ఏ) ప్రకారం 18 ఏళ్లలోపు చిన్న పిల్లలకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులకు లేదా దాని యజమానికి మూడేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే 25 ఏళ్లు వచ్చే వరకూ డ్రైవింగ్ లైసెన్స్‌కు మైనర్లు అనర్హులుగా ప్రకటించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి కేంద్రం షాక్ ఇస్తూ భారీ జరిమానా విధించేలా వాహనాల చట్ట సవరణ బిల్లును సవరించింది. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్‌లు ఇవ్వడం ఆపితే వారి భవిష్యత్‌కి బంగారు బాటలు వేసినట్టే.

నూతన చట్టాల

అమలుకు శ్రీకారం

ఏలూరు క్రైం, జూలై 1 :భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన చట్టాలు భారతీయ న్యాయసన్హిహిత, భారతీయ నాగరిక సురక్ష సన్హిహిత, భారతీయ సాక్ష్యా అధినయంలను జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో సోమవారం నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. జూలై ఒకటో తేదీ నుంచి జరిగే ప్రతి నేరానికి సంబంధించి ఈ కొత్త చట్టాల సెక్షన్ల ప్రకారమే కేసులను నమోదు చేస్తారు. ఒక వేళ జూలై ఒకటో తేదీకి ముందు జరిగిన నేరాలకు సంబంధించి ప్రస్తుతం ఇప్పుడు ఫిర్యాదుగా ఇస్తే పాత చట్టాలైన ఐపీసీ ప్రకారమే కేసులను నమోదు చేస్తారు. నూతన చట్టాల ప్రకారం సోమవారం నుంచే పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

సోమేశ్వరస్వామి సన్నిధిలో ఐజీ దంపతులు

భీమవరంటౌన్, జూలై 1 : పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీ అశోక్ కుమార్ దంపతులు సోమ వారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం పార్వతీ అమ్మవారిని, అన్నపూర్ణాదేవిని కూడా దర్శించుకున్నారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదం అందజేశారు. ఈవో రామకృష్ణంరాజు పాల్గొన్నారు.



ఐజీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకుడు

పాలం వేలం ఆదాయం రూ.16 లక్షల

పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానానికి చెందిన 52 ఎకరాల 79 సెంట్ల వ్యవసాయ భూమికి మూడేళ్ల కాలపరిమితికి 17 ప్లాట్లకు నాలుగో సారి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.16 లక్షల 69 వేలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. వేలాన్ని తాడేరు ఆలయ ఈవో పీటీ గోవిందరావు పర్యవేక్షించారన్నారు.

శ్రీవారికి మొక్కు తీర్చుకున్న మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు అర్బన్, జూలై 1 : రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కూటమి ప్రభుత్వం కొలువు తీరాలని తిరుమల వెంకన్నకు మొక్కుకున్నానని, సోమవారం తలనీలాలు ఇచ్చి మొక్కు తీర్చుకున్నట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. రాష్ట్ర పాలన గాడిలో పడి, అమరావతి పూర్తి కావాలని, పోలవరం ప్రాజెక్టు త్వరలో పూర్తి కావాలని వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్టు అంగర తెలిపారు. అనంతరం సోమవారం తెల్లవారుజామున తిరుపతిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు.



తిరుమలలో తలనీలాలు సమర్పించిన రామ్మోహన్

చిన వెంకన్నను దర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకా తిరుమల జూలై 1 : చిన్నవెంకన్నను కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. తొలిసారిగా క్షేత్రానికి విచ్చేసిన ఆమెకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. బంగారు వాకిలి గుండాలోనికి వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు కలెక్టర్‌కు స్వామి వారి శేష వస్త్రాన్ని అందించి వేద ఆశీర్వచ నాన్ని అందజేశారు. డిప్యూటీ ఈవో ఆమెకు స్వామి వారి చిత్రపటాల్ని ప్రసాదాల్ని అందించారు.



కలెక్టర్‌కి చిన వెంకన్న చిత్రపటాన్ని డిప్యూటీ ఈవో

రెండో రోజు విదేశీ నిపుణుల బృందం పర్యటన

పోలవరం జూలై 1 : పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం పర్యటన రెండో రోజు కొనసాగింది. నిపుణుల బృందం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ, నివారణ, మట్టి రాతి నాణ్యతా అంశాలపై చర్చించారు. ఈ విషయాలపై పోలవరం ప్రాజెక్టు అథార్టీ, సీఎస్ఎంఆర్ఎస్, సీడబ్ల్యూసీ, వరల్డ్ బ్యాంక్, వ్యాప్కోస్, అఫ్రికన్సల్టెన్సీ, ఫ్యుగ్రో కన్సల్టెన్సీ, జలవనరుల శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. అనంతరం డయా ఫ్రం వాల్, గత వరదలకు దెబ్బతిన్న డయా ఫ్రంవాల్ ఫొటోల ఎగ్జిబిషన్, నిర్మాణ దశలు ఇతర అంశాలను సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్ కుమార్, సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఎస్ఈ నరసింహ మూర్తి, సీఎస్ఎం ఆర్ఎస్ సైంటిస్ట్ మనీష్ గుప్తా, సీడబ్ల్యూసీ డిజైన్స్ సీఈ విజయ్ శరన్ బృందానికి వివరించారు. అనంతరం కాపర్ డ్యాంల మధ్య వైబ్రో కాంపాక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు. మంగళవారం ప్రాజెక్టులో గైడ్ బండ్‌ను ఈ బృందం పరిశీలించనుంది.



డయా ఫ్రం వాల్‌పై నడుస్తున్న విదేశీ నిపుణుల బృందం, స్పిల్ వే ఛానల్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న గోదావరి జలాలు (ఇన్‌సెట్)

ప్రాజెక్టు వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటి మట్టం అనూహ్యంగా పెరిగింది. సోమవారం ఉదయానికి స్పిల్‌వే ఎగువన 25.700 మీటర్లు, దిగువన 15.700 మీటర్లు, కాపర్ డ్యాంకి ఎగువన 25.750 మీటర్లు, దిగువన 14.400 మీటర్ల నీటి మట్టం నమోదైంది. అదనంగా వచ్చిన 29,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఈఈ పి.వెంకటరమణ తెలిపారు. కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, ఉపనదుల నీరు ప్రాజెక్టు స్పిల్ వే 48 గేట్ల నుంచి గోదావరి దిగువకు ప్రవహిస్తుంది. దిగువ కాపర్ డ్యాం మట్టి తరలించే వాహనాల కోసం స్పిల్ ఛానల్ వద్ద తూరలతో ఏర్పాటు చేసిన రోడ్డు మార్గానికి అధికారులు గండి కొట్టారు. నీటి మట్టం పెరగడంతో వరద నీరు పొంగి ప్రవహిస్తోంది.

ఆగని వైసీపీ నాయకుల భూ ఆక్రమణలు

10 రోజులుగా పట్టిసీమ గీతాశ్రమ నిర్వహకురాలి నిర్బంధం

పోలవరం, జూలై 1 : వైపీపీ రాక్షస పాలన అంతమైనా ఆ నాయకుల భూ ఆక్రమణలు ఆగడం లేదు. పట్టిసీమ గీతాశ్రమానికి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా స్థానిక వైసీపీ నాయకులు అడ్డుగా ఫెన్సింగ్ వేసి 10 రోజులుగా తనను గృహ నిర్బంధం చేశారని ఆశ్రమ నిర్వాహకురాలు 80 ఏళ్ల వృద్ధురాలు నందుల స్వరాజ్యలక్ష్మి సోమవారం మీడియా వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. అరవై ఏళ్ల పట్టిసీమ ఫెర్రీ రేవు సమీపంలో స్థాపించిన రామకృష్ణ గీతాశ్రమ స్థలాన్ని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తే జిల్లా కలెక్టర్‌ని ఆశ్రయించామన్నారు. అది గ్రామ కంఠం ప్రభుత్వ భూమి అని అమ్మడానికి, కొనడానికి ఎవరికీ హక్కులు లేవని కలెక్టర్ తెలిపి ఆశ్రమం నిర్వహించుకోమని సూచించారన్నారు. అయితే మండల స్థాయి వైసీపీ నేత అండదండలతో స్థానిక నాయకుడు ఆశ్రమానికి దక్షిణం వైపున కొంత భూమిని ఆక్రమించి మరొకరికి విక్రయించి, అటుగా రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా కంచె వేశాడన్నారు. పడమటి వైపు గతంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం నిర్మించడానికి పునాదులు వేసి వదిలేసిందని, కాంట్రాక్టర్ ఆ స్థలంలో ఆశ్రమ గేటుకి అడ్డుగా ఫెన్సింగ్ వేసి స్థలం తనదని వాదిస్తున్నాడని వాపోయారు. బోధకాలుతో అనారోగ్యంతో ఉన్న తనకు ఆహారం, మందులు పానీయాలు తెచ్చుకోవడానికి, సహాయం అందించే వారు రాకపోకలు సాగించడానికి మార్గం లేక పది రోజులుగా అవస్థలు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



ఆశ్రమ నిర్వాహకురాలు స్వరాజ్యలక్ష్మికి పింఛన్ సొమ్ములు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వైద్యులు ప్రాణ దాతలు



ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులను సన్మానిస్తున్న సీఆర్ఆర్ ఫార్మసీ కాలేజీ సిబ్బంది

ఏలూరు క్రైం, జూలై 1 : ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎంతో మంది పేదలకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారంటూ ఫార్మసీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ పరిహీన్ మాలిక్, కె.ఆశేషా,ఎం.మనోజ్‌కుమార్ అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు ప్రభుత్వాసుపత్రి వైద్యులను దుశ్శాలువాతో సన్మానించి బహుమతులను అందజేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఫిజిషియన్ డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఏఎస్ రామ్, న్యూరో సర్జన్ డాక్టర్ రవికుమార్‌ను సన్మానించి బహుమతులను అందించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోని వైద్యులకు బహుమతులు అందజేశారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాల వివరాలు ఇవ్వండి

ఏలూరు అర్బన్, జూలై 1 : జిల్లా పరిషత్ పీఎఫ్ ఖాతాలకు సంబంధించిన వివరాలను నాలుగేళ్లుగా నవీకరించకపోవడం వల్ల ఉపాధ్యాయులు తమ ఖాతాల్లో నగదు నిల్వల గురించి తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర సోమవారం జడ్పీ సీఈవోకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ అభ్యర్థనపై స్పందించిన సీఈవో ఖాతాదారుల వ్యక్తిగత వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందుపర్చామన్నారు. వాటిని సంబంధిత టీచర్లు పరిశీలించుకుని లోపాలుంటే సరిచేయడానికి అవకాశం కల్పిస్తున్నామని, ఈ ప్రక్రియను ముగించిన వెంటనే తుది వివరాలను ఖాతాదారులకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు. సీఈవోను కలిసిన వారిలో ప్రకాష్, రామశేషుకుమార్, ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులపై కేసు

ఏలూరు క్రైం, జూలై 1 : అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పవర్‌పేటకు చెందిన కనిగొళ్ల శ్రీలక్ష్మి శ్రీచంద్రలేఖకు 2021లో హైదరబాద్‌కు చెందిన విడేల నాగవెంకట సత్యగణేష్‌తో వివాహమైంది. ఆ సమయంలో రూ.ఐదు లక్షల కట్నం, సారె, ఆడపడుచు కట్నం ఇచ్చారు. ఒక ప్రైవేటు కంపెనీలో సత్య గణేష్ పని చేస్తున్నాడు. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాల్లేదంటూ అదనపు కట్నం తీసుకు రావాలని శ్రీలక్ష్మి శ్రీచంద్రలేఖను భర్త సత్యగణేష్‌తోపాటు అత్త, మామలు, ఆడపడుచులు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో బాధితురాలు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో దొంగల హల్‌చల్

ఏలూరు క్రైం, జూలై 1: ఏలూరు రూరల్ మండలంలోని మూడు దేవాలయాల్లో దొంగలు హల్‌చల్ చేసి అందిన కాడికి హుండీలను పగులగొట్టి సొమ్ము దోచుకుపోయారు. సుంకరవారితోట కనకదుర్గమ్మ దేవాలయంలో హుండీని పగులగొట్టి రూ.15 వేల నగదును అపహరించుకుపోయారని దేవూరి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాదేవపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మ ఆలయాల్లో దొంగలు ఆదివారం అర్ధరాత్రి ఈ నేరాలకు పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి సోమవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ ద్వారా నేరస్తులను గుర్తించారు. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



హుండీని అపహరించిన దొంగ

పింఛన్ సొమ్ము వెంటబెట్టుకెళ్లిన ఉద్యోగి

నగదు స్వాధీనం చేసుకున్న సచివాలయ సిబ్బంది

కుక్కునూరు, జూన్ 1: మండలంలోని ఉప్పేరు సచివాలయం పరిధిలో ఓ ఉద్యోగి పింఛన్ డబ్బులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా వెళ్లిపోవడం కలకలం రేపింది. దామరచర్ల పంచాయతీలో పింఛన్ పంపిణీ చేయాలని ఆ ఉద్యోగికి అధికారులు సోమవారం దాదాపు రూ.లక్ష ఇచ్చారు. కేవలం నలుగురికి మాత్రమే పింఛన్ పంపిణీ చేసి తరువాత అతడు కనిపించక పోవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు, పోలీసులు అప్రమత్తమై దీనిపై విచారణ జరిపారు. పింఛన్ సొమ్ము పట్టుకుని ఇంటికి వెళ్లిపోయినట్లు ప్రచారం కూడా జరిగింది. కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆ ఉద్యోగి ఒక ఫంక్షన్ నిమిత్తం సొంత ఊరికి వెళ్తూ మార్గమధ్యలో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. అయితే పింఛన్‌లు చెల్లించగా అతని వద్ద మిగిలిన నగదును స్వాధీనం చేసుకున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

విద్యార్థిని బలి తీసుకున్న బెట్టింగ్‌లు

ఆగిరిపల్లి, జూలై 1: ఆత్మహత్యాయత్నం చేసిన ఆగిరిపల్లిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల మూడో సంవత్సరం చదువుతున్న నూజివీడుకు చెందిన పి.తేజ (23) అనే విద్యార్థి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెట్టింగ్‌లకు అలవాటుపడి స్నేహితుని వద్ద అప్పు చేసి అది తీర్చలేక, తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే బాధపడతారని గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు విజయవాడ ఆస్పత్రిలో చేర్చారు. నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచాడు.

ఆర్టీసీ బస్టాండ్‌లో భారీ చోరీ

» రూ.11 లక్షల నగదు » 400 గ్రాముల బంగారం అపహరణ

నరసాపురం, జూలై 1; నరసాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.11 లక్షల నగదు, 400 గ్రాముల బంగారం ఉన్న బ్యాగ్‌ను కొట్టేశారు. ఈ సంఘటనతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన ఒక బులియన్ వ్యాపారి గుమస్తా నగదు వసూలు, అభరణాల ఆర్డర్ నిమిత్తం ఉదయం పట్టణానికి వచ్చాడు. వ్యాపారుల నుంచి నగదు వసూలు చేసి, ఆభరణాల ఆర్డర్లు తీసుకొని, వాటి తయారీకి బంగారం కూడా తీసుకొని భీమవరం బయలు దేరాడు. బస్టాండ్‌కు వచ్చే సరికి మత్స్యపురి-భీమవరం బస్సు అప్పుడే ప్లాట్‌ఫాం మీద ఆగింది. బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల ఎక్కువగా ఉండడంతో సీటు దొరకదన్న ఉద్దేశంలో కిటికిలోంచి క్యాష్ బ్యాగ్ సీటుపై వేశాడు. బస్సు ఎక్కి చూసే సరికి బ్యాగు కనిపించ లేదు. వెంటనే బస్సు దిగి చుట్టు పక్కలు చూసే సరికి బ్యాగుతో పరిసర ప్రాంతాల్లో ఎవరు కనిపించ లేదు. మళ్లీ బస్సు ఎక్కి ప్రయాణీలందరి దగ్గరికి వెళ్లి వెతికాడు. ఎవరి దగ్గర బ్యాగు లేదు. విషయాన్ని గుంటూరులోని వ్యాపారికి, స్థానిక వ్యాపారులకు తెలియజేశాడు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.25 లక్షలు వరకు ఉంటుందని అంచన. అయితే రాత్రి వరకు దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. దీనిపై నరసాపురం బులియన్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్ జైన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గుమస్తా వద్ద పూర్తి వివరాలు లేవన్నారు. గుంటూరు నుంచి ప్రధాన వ్యాపారి మంగళవారం ఉదయం నరసాపురం చేరుకుంటారని తెలిపారు. పట్టణంలోని వ్యాపారుల నుంచి వసూలైన నగదు, వస్తువుల తయారీకి తీసుకున్న బంగారం అన్ని లెక్క గట్టి సంఘం తరుపున కేసు పెడతామని చెప్పారు.

నందమూరులో...

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1: నందమూరులో ఆదివారం రాత్రి భోగాల సత్యనారాయణ ఇంట్లో దుండగులు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ వస్త్రాల వ్యాపారం చేస్తుంటారు. ఆయన కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు పని మీద వెళ్లగా ఆదివారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని రూ.లక్షా ఐదు వేల నగదు, 35 గ్రాముల బంగారం, 41 గ్రాముల వెండి దొంగిలించుకుపోయారు. సత్యనారాయణ ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టినట్టు గుర్తించి ఇంట్లో పరిశీలించగా చోరీ జరిగినట్టు నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పెరిగిన పింఛన్లతో ఆనందం

పింఛన్ల పెంపుతో పేదల్లో సంతోషం వ్యక్తమైంది. వృద్ధులతో పాటు వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనవారికి ప్రభుత్వం పెంచిన మొత్తం కలిపి పింఛన్లు అందించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు అండగా నిలిచిందని, జీవితంపై భరోసా ఇచ్చిందన్నారు. వారి ఆనందం వారి మాటల్లోనే..

ఏలూరు టూటౌన్, ద్వారకా తిరుమల

జీవితానికి భరోసా ఇచ్చారు

టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్‌తో జీవితంపై భరోసా ఏర్పడింది. గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.5వేలు పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రూ. 15 వేలు అందజేసింది. నెలకు ఎవరిని ఆడగకుండా రూ.15 వేలు నాకు మందుల ఖర్చులు, తిండికి సరిపోతుంది. చాలా ఆనందంగా సంతోషంగా ఉంది.

- షేక్ కరీమున్నీసా, దివ్యాంగురాలు, తంగెళ్ళమూడి

ఆర్థిక ఇబ్బందుల నుంచి విముక్తి

షేక్ గౌసియా పుట్టుకతోనే దివ్యాంగురాలు. ఆమె తల్లి షేక్ ఫాతిమున్నీసా అన్ని చూసుకుంటుంది. ఫాతిమున్నీసా మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.3వేలు పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రూ.6వేలకు పెంచడం ఆనందంగా ఉంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంత విముక్తి కలిగింది. పింఛన్ అదనంగా రూ.3వేలు పెంచిన చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు

- షేక్ గౌసియా, దివ్యాంగురాలు, తంగెళ్ళమూడి

ప్రభుత్వం అండగా నిలిచింది

అనిల్‌కుమార్ 9ఏళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమయ్యాడు. గత వైసీపీ ప్రభుత్వం రూ.5వేలు పింఛన్ ఇచ్చేది. టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.15వేలు అందించింది. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రూ.15వేలు అందించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్థికంగా తమ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

- ఎ.అనిల్‌కుమార్, పూర్తిస్థాయి అంగవైకల్యం, ఇజ్రాయిల్‌పేట

చంద్రబాబుకు చేతులెత్తి మొక్కుతున్నా

ఈ రోజు రూ. ఏడు వేలు పింఛను ఇచ్చారు. ఇంత మొత్తాన్ని అందుకోవడం తొలిసారి. చంద్రబాబుకు చేతులెత్తి మొక్కుతున్నాను. తెల్లవారకుండానే ఎమ్మెల్యే గారు మా ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

- భవిరిశెట్టి నాగేశ్వరమ్మ, ద్వారకాతిరుమల

హక్కులు, చట్టాల అమలుకు పోరాటాలు తప్పవు



కేఆర్.పురంలో ఏఐకేఎంఎస్ నేతల ర్యాలీ

బుట్టాయగూడెం, జూలై 1: పోరాటాల ద్వారానే ఆదివాసీలకు హక్కులు, చట్టాలు కల్పించబడ్డాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ అన్నారు. సంతాల్ ఆదివాసీ తిరుగుబాటు జరిగి 169 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అఖిలభారత ట్రైబల్ ఫోరం పిలుపు మేరకు సోమవారం కేఆర్.పురంలో సభ జరగ్గా సురేష్ మాట్లాడారు. మన దేశాన్ని వలస పాలనగా సాగించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, స్థానిక భూస్వాములు, వ్యాపాకుల దోపిడీలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్లోని సంతాల్ ప్రాంతంలో ఆదివాసీలు పెద్ద ఎత్తున ఉద్యమించారని, అనేక మంది గిరిజనులు మరణించారని తెలిపారు. అటువంటి పోరాటాన్ని నేటి గిరిజనులు వారసత్వంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా చట్టాలను ఎత్తివేయడం కోసం కేంద్రం కుట్రలు చేస్తుందని, వాటికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని తెలిపారు. పోరాటాలు చేసి సాధించుకున్న 2006 ఆటవీ హక్కుల చట్టంకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టానికి కేంద్రం చేసిన సవరణ వలన ఆదివాసీలు అడవిలో నివశించే హక్కును కోల్పోతున్నారని తెలిపారు. కారం రాఘవ, సరియం రామ్మోహన్, వెట్టి భారతి, పి.శ్రీనివాస్, వి.సుబ్బన్న, కేవీ.రమణ, వి.సద్గురు, టి.బాబురావు, కె.ప్రసాద్, ఎస్.ముక్కారెడ్డి, సర్పంచ్‌లు కారం అరుణ, మాంద్రు శారద, మడివి శ్రీరాములు, కెచ్చెల ముక్కారెడ్డి, ఎంపీటీసీలు మడకం వెంకటలక్ష్మి, కొవ్వాసు గోవిందరాజు, అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 1: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరుబాట నిర్వహిస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. పవరుపేటలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యల అధ్యయనానికి ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్ర నాయకులు రానున్నట్లు తెలిపారు. 4న వేలేరుపాడు మండలం రేపాకబొమ్మి, కుక్కునూరు మండలం కివ్వాక, చీరవల్లి మాదవరం, 5న జీలుగుమిల్లి మండలం నిర్వాసిత కాలనీలు, జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లావారిగూడెంలో నిర్వాసిత కాలనీల్లో పర్యటించి అధ్యయనం చేస్తారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.నాగరాణి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు.

ఎస్సీలకు పింఛన్లు మంజూరు చేయండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, జూలై 1: 50 ఏళ్ల వయసు దాటిన ఎస్సీలకు కూడా ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్లు ఇస్తామని ప్రకటించిందన్నారు. బీసీలతోపాటు ఎస్సీలకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పునరుద్ధరించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్. వెంకటేశ్వర్లకు అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలను నిలుపుదల చేసిందన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలని సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో వి.రాజు, టి.రాజు, సుధాకర్, డేవిడ్‌రాజు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీల పథకాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఏలూరు జిల్లాలోనే మహిళలకు శిక్షణ ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఏలూరు కలెక్టరేట్, జూలై 1: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో మహిళలకు ఏలూరులోనే శిక్షణ ఇవ్వాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. పీఎం విశ్వకర్మ యోజనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగువర్గాల మహిళలకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారని, అంత దూరంలో శిక్షణ పొందడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏలూరు జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలని కోరారు. బేతాళ జయసుధ, కె.సువార్త, పిల్లి దుర్గ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మంచినీటి కోసం మహిళల ఆందోళన



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ద్వారకాతిరుమల, జూలై 1: తాగు నీరు దొరక్క ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని వసంత నగర్ కాలనీవాసులు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఇక్కడున్న 700 కుటుంబాల తాగునీటి అవసరాలకు కొత్తబోరు వేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఎంపీడీవో తిరుపతిరావుకు మహిళలు వినతి పత్రం అందజేశారు. మంచినీటి ట్యాంకర్‌ను పంపిస్తామని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ద్వారకాతిరుమల, జూలై 1: జి.కొత్తపల్లిలో పలువురు వైసీపీ నేతలు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రేగంటి రాంబాబు నేతృత్వంలో టీడీపీలో చేరారు. వైసీపీ హయాంలో గ్రామ అధ్యక్షుడిగా పనిచేసి ఆ పార్టీ వారి చేతిలోనే హత్యకు గురైన గంజి ప్రసాద్ భార్య సత్యవతి, ఆమె కుమారుడు, అనుచరులు టీడీపీలో చేరారు. టీడీపీ కండువా కప్పి మండల అధ్యక్షుడు సత్తిపండు సాదరంగా ఆహ్వానించారు.






వేగివాడలో పింఛన్ పంపిణీ చేస్తున్న కూటమి నేతలు, కురెళ్ళగూడెం, బుట్టాయగూడెం మండలం, కె.కోట మండలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని, మాజీ ఎమ్మెల్యేలు మొడియం, ఘంటా మురళి

పింఛన్ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా

జిల్లాలో పెన్షన్ సొమ్ము పంపిణీ



జంగారెడ్డిగూడెంలో పింఛన్ అందుకున్న ట్రాన్స్‌జెండర్ల ఆనందం

ఏలూరు టూటౌన్, జూలై 1: పండుగ వాతావరణంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది. సోమవారం ఉదయం 6గంటలకు 7వ డివిజన్‌లో కలెక్టర్ వెట్రి సెల్వి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ల పెంచారన్నారు. ప్రతీ పేదవాని ఇంట్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ప్రతీ నెల ఇంటి వద్ద పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, జనసేన ఇన్‌చార్జి అప్పలనాయుడు, డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం, టీడీపీ నాయకులు బలరామ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేశామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొత్తూరు గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రి సెల్వితో కలిసి ఎమ్మెల్యే చింతమనేని సోమవారం ప్రారంభించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా, గ్రామాలు అభివృద్ధి సాధించాలన్నా చంద్ర బాబు పాలనలోనే సాధ్యమన్నారు. గతంలో జరిగిన సామాజిక పింఛన్ల అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఘంటశాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, ఉప్పలపాటి రాంప్రసాద్, మోరు శ్రావణి, గారపాటి రామసీత, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబు, తాతా సత్యనారాయణ, బొప్పన సుధా, మాగంటి నారాయణ ప్రసాద్, కాశీవిశ్వనాథం, ఎంపీటీసీ వల్లపోతు శ్రీనివాసరావు, కడగంచి శ్రీనివాసరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: మండలంలోని శ్రీరామవరంలో మోతుకూరి నాని ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. గోపన్నపాలెంలో మాగంటి మిల్లుబాబు, గాలాయగూడెంలో ఏనగు రామకృష్ణ, పూజారి శ్రీనివాసరావు, పెరుగుగూడెంలో యలమర్తి హేమ శ్రీనివాస్, చల్లచింతలపూడిలో నాగనబోయిన సత్యనారయణ, ముమ్మడి మెహన్‌రావు, రాముగౌడ్, పోతునూరులో నున్న లక్ష్మణ్, బోడేటి మోహన్ తదితరుల ఆధ్వర్యంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు. ఎంపీడీవో శ్రీలత ఆధ్వర్యంలో మండలంలో 9,651 మందికి రూ.6,60,39,500 పంపిణీ చేశారు. సర్వర్ సమస్యతో పంపిణీలో కొంత జాప్యం జరిగింది.

● బుట్టాయగూడెం: మండలంలో 7091 మంది పింఛన్‌దారులకు సుమారు రూ.4.90 కోట్లు గ్రామ సచివాలయం ఉద్యోగులు, కూటమి నాయకులు పింఛన్లను పంపిణి చేశారు. 14 పంచాయతీల్లో ఆన్‌లైన్, 7 పంచాయతీల్లో ఆఫ్‌లైన్‌లో పింఛన్లు అందజేశారు. రాజానగరంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, కండ్రికగూడెంలో మొగపర్తి సోంబాబు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉందని, ఎన్టీఆర్ భరోసా పథకంలో పింఛన్ల పంపిణీ నిదర్శనమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, చంద్రమ్మ కాలనీ, రామన్నపాలెం, పి.అంకంపాలెం గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, చిర్రి శ్రీను, కోలా మధు, రూపా నాని, గడ్డి సుబ్రహ్మణ్యం, గారపాటి శ్రీను, నారగాని నరేంద్ర, ఉవలవల శివ, ఎంపీడీవో కెఎం.మంగతాయారు ఉన్నారు.

● జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు పింఛన్లు పంపిణీ చేశారు. సీఐ పి.రాజేష్, టీడీపీ నాయకులు పోల్నాటి సత్యనారాయణ, ఎలికే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డాంగే నగర్‌లో పింఛన్లు అందుకున్న ట్రాన్స్‌జెండర్ ఆనందంతో డాన్స్‌లు చేశారు. 2014లో తొలిసారి ట్రాన్స్‌జెండర్లకు రేషన్‌కార్డులు ఇచ్చారని, ఇప్పుడు పింఛన్లు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు తమను ఆదుకున్నారన్నారు.

● ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకాతిరుమల, తిమ్మాపురం, పంగిడిగూడెం, నారాయణపురం, గుణ్ణంపల్లి తదితర గ్రామాల్లో కూటమి కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పింఛన్లు పంపిణీ చేశారు. లంకా సత్తిపండు, మల్లిపెద్ది వెంకటేశ్వర రావు, మొగతడకల శ్రీనివాస రావు, సువర్ణరాజు, పోలిన శ్రీనివాసరావు, పాతూరి సహృదయ్, నరసింహమూర్తి, మటపర్తి బద్రి, షైలు వాసు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పింఛన్ పంపిణీ చేశారు. గ్రామ గ్రామాన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పింఛను పంపిణీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పంది ప్రభావతి, సూర్యచంద్రరావు, కొనకళ్ళ శివమణి, మాదు రవికుమార్, కొఠారు ఆదిశేషు, తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, కంచెన మోహనరావు, అడపా శ్రీను, గుర్రం మాధవ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలోని భీమడోలు, పోలసానపల్లి, కూరెళ్ళగూడెం, అంబర్‌పేట గ్రామాల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పింఛన్లను అందజేశారు. పోలసానపల్లిలో ఎమ్మెల్యే ధర్మరాజుతోపాటు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో కలిపి పింఛన్లు అందజేశారు. కూటమి నేతలు గన్ని నాగగోపాలరావు, ప్రత్తిమదన్, దూసనపూడి పుల్లయ్యనాయుడు, పెద్దిరాజు, ప్రవీణ్‌పటేల్, పోలసానపల్లి సర్పంచ్ హసీనా రహీమా బేగమ్, బీజేపీ, జనసేన, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండుగొలను ఎస్సీ కాలనీకి చెందిన కొవ్వలి రాజు అనారోగ్యంతో ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శివశంకర్, కూటమి నేతలు ఆసుపత్రికి వెళ్ళి పింఛన్ అందజేశారు.

● ఉంగుటూరు: మండలంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వేర్వేరు చోట్ల కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు బందారు సింధు మధు, రాందే లక్ష్మీ సునీత, దిడ్ల అలకనంద, రెడ్డి సూర్యచంద్రరావు, పాతూరి విజయకుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 8,223 లబ్ధిదారుల్లో 95 శాతం మందికి పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, ఏవో సత్యవాణి తెలిపారు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, ఘంటా సుధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, కోనేరు వెంకట్రామయ్య తూతా లక్ష్మణరావు, షేక్ వలీ, ఒంటెద్దు ఏసువరప్రసాద్, కాకి చంటి, నల్లూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రావికంపాడులో సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ఆడమిల్లిలో సర్పంచ్ గూడపాటి కేశవరావు, తాడిచర్లలో సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, గుంటుపల్లిలో సర్పంచ్ గోరింక దాసు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. రామన్నపాలెం, తూర్పు యడవల్లి, పోలాసిగూడెం, కళ్ళచెరువు తదితర గ్రామాల్లో పింఛన్లు అందజేశారు.

● కుక్కునూరు: మండలంలో కూటమి నాయకులు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పలుచోట్ల డప్పు వాయిద్యాలతో జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, శ్రీను, యుగంధర్, లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పింఛన్లు అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు కూటమి నేతల సహకారంతో పింఛన్లు అందజేశారు. గ్రామాల్లో పింఛన్లు అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, గారపాటి బుజ్జియ్య మునునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, యలమంచి శ్రీనివాసరావు, నందిగం సీతారామ్‌తిలక్, వలీ, ఆసిలేటి అజయ్, బొంతు రాంబాబు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నిడమర్రు: మండలంలో ఫత్తేపురం, తోకలపల్లి, మందలపర్రు, భువ్వనపల్లి గ్రామాలలో వృద్ధులు, దివ్యాంగులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. రుద్రరాజు కొండరాజు, పొత్తూరి నరసింహరాజు, కిలారి సత్యవతి రవిబాబు, చింతలపాటి బాసిరాజు, నిమ్మల దొరబాబు, సంకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు: మండలంలోని 9గ్రామ పంచాయతీల పరిధిలో 3257 లబ్ధిదారులకు రూ.2,25,60500 నగదు ఎంపీడీవో శ్రీహరి పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. సర్వర్ సమస్యతో అక్కడక్కడ కొంత జాప్యం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దగ్గరుండి లబ్ధిదారులకు పింఛన్ అందించారు.

● ఏలూరు రూరల్ / క్రైం: రూరల్ మండలం మాదేపల్లి, మల్కాపురం, శ్రీపర్రు గ్రామాల్లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పింఛన్లు పంపిణీ చేశారు. మల్కాపురం గ్రామానికి చెందిన రేవులగడ్డ సావిత్రమ్మ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. చింతమ నేని ప్రభాకర్ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకుడు నేతల రవి చికిత్సపొందుతున్న సావిత్రమ్మకు పెన్షన్ అందజేశారు. మాదేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రణవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండలంలోని వీరభద్రవరం, తిరుమలదేవిపేట, రాజుపోతేపల్లి, కె.జగ్గవరం, అప్పలరాజుగూడెం, రామన్నపాలెం తదితర గ్రామాల్లో కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. శీలం వెంకటేశ్వరరావు, తోట లక్ష్మీనారాయణ, నల్లూరి వెంకట చలపతిరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, రామకృష్ణారావు గౌడ్, పెట్టిన సత్యనారాయణ, కాపన్నేని వెంకట్రావు, బీమవరపు జగన్మోహన్‌రావు, బండి శ్రీనివాసరావు, లింగారెడ్డి శ్రీనివాసరావు, జయ్యవరపు శ్రీనివాసరావు, లింగారెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలోని సుప్రీంపేటలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. నందమూరి కాలనీ, వెలగలపల్లి గ్రామాల్లో పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రాటాలు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, జడ్పీటీసీ నీరజ, ఎంపీపీ రాంబాబు, కూటమి నాయకులు టి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాజారెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, చీదిరాల మధుబాబు, టి.నాగవిజయ్‌కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, సచివాలయాల పరిధిలో పండుగలా సాగాయి. ప్రగడవరం, వెంకటాపురం, పాత చింతలపూడి, రాఘవాపురం, ఎర్రగుంటపల్లి, తిమ్మిరెడ్డిపల్లి, సీతానగరం, ఊటసముద్రం తదితర గ్రామాల్లో చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సాయికుమారి, అనీష్‌కుమార్, మాటూరి వెంకటరామయ్య తాళ్ళూరి రాధారాణి, వైవీ.సత్యనారాయణ, టి.భాస్కర్, సీహెచ్ మోహన్‌రావు, ముత్తాశేఖర్, నాగేశ్వరరావు, కొమ్మరాజు సత్యనారాయణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూటమి నాయకులు నిర్వహించారు. అనపర్తి వెంకట నారాయణ, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, చెంచాని ప్రసాద్, కరిబండి నాగరాజు, చిలకా రాంబాబు, కుంచే దొరబాబు, బొడ్డు కృష్ణ, పోతుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.






కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, జంగారెడ్డిగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు

డాక్టర్ బీసీ రాయ్ సేవలు మరువలేనివి

పెదవేగి, జూలై 1: భారతరత్న డాక్టర్ బీసీ.రాయ్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. బీసీ.రాయ్ జయంతి, జాతీయ వైద్యుల దినోత్సవాన్ని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైద్యులను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ అంకితభావంతో, బాధ్యతగా సేవలందించిన డాక్టర్ బీసీ.రాయ్ భావితరాల వైద్యులకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు, కార్యదర్శి ఆర్వీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు శ్రీనివాసరాజు, ఎ.అనూరాధ, చక్రపాణి, కె.సీతారామ్ ప్రసాద్, పి.అరవింద్‌కుమార్, వంశీ కృష్ణారెడ్డి, శ్రీనిధి, ఎం.పావన సంధ్యను ఘనంగా సత్కరించారు. సీహెచ్.అవినాష్ రాజు, శేషుకుమార్, రమణమూర్తి, హరికుమార్ పాల్గొన్నారు.

● లింగపాలెం: వైద్య సేవలందించడంలో ఉన్న తృప్తి అనిర్వచనీయమని, కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీలో డాక్టర్స్‌డే సందర్భంగా కృష్ణకిషోర్, అబేదాను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ వైద్య వృత్తిలో వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతూ ఆపదలో ఉన్న రోగులకు సేవలందించడంలోనే వైద్యులు తృప్తిచెందుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్.కె అబ్రార్ హుస్సేన్, ఉమామహేశ్వరరావు, నాగేంద్ర, స్వరూప, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కన్నం హనుమంతరావు, కార్యదర్శి కొండపల్లి పండు, కాకర్ల వీర భద్రరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, భవిరిశెట్టి మురళి, అట్లూరి సురేష్, దాసరి శేషు, ఏరియా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న వైద్యులు అభినందనీయులని విర్డ్ ఆసుపత్రి ట్రస్టీ వెంపరాల నారాయణమూర్తి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా విర్డ్ ఆసుపత్రి వైద్యులను ఆసుపత్రి ట్రస్టీలు వెంపరాల, ఐవీఆర్ సుధాకరరావు, ఎంఎస్ఆర్, తూంపాటి ప్రసాద్ సత్కరించారు. వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, గోపి, జితేంద్ర పాల్గొన్నారు.

● చింతలపూడి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు డాక్టర్లను సన్మానించారు. వైద్యులు రామకృష్ణ, మణికంఠ, తౌఫీస్, హరీష్, భవ్య, బండి లక్ష్మీ ప్రసాద్, చైతన్యకుమార్‌ను శాలువాకప్పి సన్మానించారు. సీహెచ్ విజయలక్ష్మి, గోలి చంద్రశేఖరరెడ్డి, అడపా శ్రీను, కొనకళ్ళ నెహ్రూ పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి, సిబ్బంది, చేబ్రోలు పీహెచ్‌సీ వద్ద ఎమ్మెల్యే ధర్మరాజు, ధర్మాజీగూడెం ర్యాలీలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

అతిసార వ్యాధి నివారణపై అవగాహన

ఏలూరు అర్బన్, జూలై 1: అతిసారవ్యాధి నివారణకు చేపట్టిన 'స్టాప్ డయేరియా' రెండు నెలల ప్రత్యేక డ్రైవ్‌ను ఏలూరులో జిల్లా వైద్యాధికారి శర్మిష్ట సోమవారం ప్రారంభించారు. ఆగస్టు నెలాఖరువరకు ప్రతీఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి ఐదేళ్ల లోపు చిన్నపిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తారని, తల్లులకు డయేరియాపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు, నీటి నమూనాల పరీక్షలు, క్లోరినేషన్ వంటి చర్యలతో రక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా పంచాయతీ సిబ్బందితో కలసి పనిచేస్తారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్: అతిసార నివారణకు ప్రజలు సామాజిక బాధ్యత వహించి సహకరించాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. 15వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద చంటి మాట్లాడుతూ అధికారులు డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరంలో ఒక డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంకటకృష్ణ, ఎంహెచ్‌వో మాలతి, డిప్యూటీ మాజీ మేయర్ వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: పిల్లలు డయేరియా బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. చేబ్రోలు పీహెచ్‌సీలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రబలే వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు వర్మ, శ్రావణ్ రెడ్డి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత, కూటమి నాయకులు, ఎంపీహెచ్‌వోలు పాల్గొన్నారు.

● లింగపాలెం: డయేరియా ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వద్ద స్టాప్ డయేరియా ర్యాలీ ప్రారంభించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యులు యానీప్రీతి, ప్రియాంక, కృష్ణకిషోర్, గారపాటి బుజ్జియ్య, గరిమెళ్ళ చలపతిరావు, మునునూరి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు అతిసార వ్యాధి నివారణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. పీహెచ్‌సీలో స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది శ్రద్ధ చూపాలన్నారు. వైద్యులు విధులకు ఆలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంవో, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌తో మాట్లాడారు.

నారాయణపురం విద్యార్థులకు పీజీ సెట్ ర్యాంకులు

ఉంగుటూరు, జూలై 1: నారాయణపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏపీ పీజీ సెట్‌లో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో టేకి వెంకట రాజ్యలక్ష్మి(154)వ ర్యాంకు, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో కోరాడ వనజ(325)వ ర్యాంకు, గంటా రుషి ఎంకాంలో (342)వ ర్యాంకు, ఏపీ ఐసెట్‌లో టేకి పాల్ శైలేష్, రాపాక దుర్గ మహేష్ ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. అకాడమి కోఆర్డినేటర్ కొండా రవి విద్యార్థులను అభినందించారు.

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, జూలై 1 : మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మెయిన్ రోడ్డు, బీసీ కాలనీ, బాపూజీ కాలనీ, కొత్తపేట, పట్టిసీమ వీరభద్రపురం గ్రామాలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ విద్యార్థినులకు పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధికి యాజమాన్యం, అధ్యాపకులతోపాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలన్నారు. డాక్టర్ నిర్మల జ్యోత్స్న, రత్నమేరీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సెలీన్‌రోజ్, అధ్యాపకులు జ్యోతికుమారి, మహాలక్ష్మి, అరుణ, శ్రీలత, ఇందిరా, పద్మజ పాల్గొన్నారు.
- అమెరికా 'నాసా' నిర్వహించిన పోటీలో శ్రీ చైతన్య ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ దుర్గారావు తెలిపారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను స్కూలు ప్రతినిదులు పార్థసారది, ఉదయబాస్కర్, వెంకటేశ్వరరావు, గిరిదర్ తదితరులు అందజేసారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలోని శివాలయాల వద్ద భక్తులు విశేష పూజలు చేశారు. శివాలయాలన్నీ భక్తులతో శివనామస్మరణతో మార్మోగాయి. శివనగర్ మల్లికార్జున స్వామికి అర్చకులు అభిషేకాలు, రుద్రాభిషేకాలు జరిపించారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, గాంధీనగర్‌లోని అవిముక్తేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.
- **కామవరపుకోట :** విశ్వతేజ పాఠశాల రికార్డులను సోమవారం ఎంఈవో డి.సుబ్బారావు సమగ్ర పరిశీలన చేశారు. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు. ఈపాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఎనిమిది సంవత్సరాలపాటు ఉందని తెలిపారు.
- **చింతలపూడి :** రాఘవాపురం జడ్పీ హైస్కూల్లో 400 మంది విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను మండల టీడీపీ అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య పంపిణీ చేశారు. మాటూరి అనిల్, నాగుబండి గోపాలరావు, శ్రీరామ్మూర్తి, అచ్యుత్, కరెడ్ల మహేష్ పాల్గొన్నారు.
- చింతలపూడి పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు ముళ్ళగిరి ఇమ్మానియేల్ అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.వసంతరావు, కార్యదర్శిగా బజారు కృష్ణ, ఉపాధ్యక్షులుగా కొత్తా శ్రీను, సంయుక్త కార్యదర్శిగా చంద్రు కృష్ణ, కోశాధికారిగా దేశాబత్తుల వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. జిల్లాసంఘ నాయకులు కంచర్ల అబ్రహం, ఎస్.కె సుభానీ, రాంబాబు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి పార్థసారథి



రావిచర్లలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



కైకలూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కమ్మిలి, పెన్మెత్స తదితరులు



[illegible]గూడెంలో పెన్షన్ల పంపిణీ చేస్తున్న బొట్టు వరలక్ష్మి

వాడవాడలా పింఛన్ల పండుగ

» వృద్ధుల మోములో వెల్లివిరిసిన ఆనందం » చరిత్ర సృష్టించిన చంద్రబాబు : మంత్రి పార్థసారథి

నూజివీడు, జూలై 1: రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల 18 వేల మందికి ప్రతినెల రూ.4,408 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా అందిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జాతీయ స్థాయిలో ఎన్టీఆర్ భరోసా ద్వారా అత్యధికంగా పింఛన్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో అయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. పేదల కళ్ళల్లో పెన్షన్ పెంపుతో ఆనందం కనబడుతోందన్నారు. గత ప్రభుత్వం రాబోయే 25 సంవత్సరాల ఆదాయాన్ని తాకట్టుపెట్టి అప్పుతెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసిందన్నారు. వలంటీర్లు ఉంటేనే పింఛన్ల పంపిణీ సాధ్యమన్న జగన్ మాట బూటకమని, 1వ తేదీన నూరుశాతం పింఛన్ లను ప్రభుత్వ అధికారులతో ఇంటివద్దే అందించవచ్చని చంద్రబాబునాయుడు నిరూపించారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 2,68,353 మంది పెన్షన్‌దారులకు రూ. 182.73కోట్ల పింఛన్‌గా అందిస్తున్నామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయ్‌రాజు, నూజివీడు ఇన్‌ఛార్జ్ ఆర్డీవో ఎం.ముక్కంటి, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ శ్రీవాణి చౌదరి, టీడీపీ నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరి రాజా తదితరులు పాల్గొనగా, పింఛన్ల పంపిణీని పురస్కరించుకుని మంత్రి పార్థసారథి సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం, పట్టణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ వాడవాడలా సన్నాయి మేళాల మధ్య పండుగ వాతావరణంలో జరిగింది. నూజివీడు మండలం దిగవల్లిలో మాజీ ఎంపీటీసీ యలమంచిలి నాగేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ ముదగన గిరిబాబుల ఆధ్వర్యంలో, మిట్టగూడెంలో సర్పంచ్ నరసింహారావు, బత్తులవారిగూడెంలో సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ, రావిచర్లలో మాజీ ఎంపీటీసీలు వెనిగళ్ళ సాంబశివరావు, లావు ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పింఛన్‌లను పంపిణీ చేశారు. రావిచర్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీడీపీ నాయకులు అనంతరం పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఎంఎన్ పాలెంలో టీడీపీ నాయకులు యనమదల సత్యనారాయణ (నాని) ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. నూజివీడు పట్టణంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, పట్టణ టీడీపీ కార్యదర్శి పల్లి నాగరాజుల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు తిరుమలశెట్టి సాధనా స్రవంతి, దాసరి స్వామియాదవ్, మాజీ కౌన్సిలర్ అన్నే నాని, నూజివీడు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు లాయర్‌కుమార్ ఆధ్వర్యంలో పింఛన్‌లను ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేశారు.

ముసునూరు: పెన్షన్ పంపిణీని సోమవారం పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారుల ఇంటివద్దే అందజేశారు. సాయంత్రం 6 గంటల వరకు 7990 మందికి గాను 7590 మందికి నగదు పంపిణీ చేశారు. తొలుత గ్రామ సచివాలయాల వద్ద బాణసంచా కాల్చి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు కూటమి నాయకులు పాలాభిషేకం చేశారు. గుడిపాడులో సన్నాయి మేళాలతో ర్యాలీగా పెన్షన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి, నగదుతో పాటు స్వీట్లను టీడీపీ నాయకులు మండలపు బుజ్జియ్య, కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబు, బోగోలు సత్యనారాయణ, మండలపు ధర్మరాజు, వి.మాధవరావులు అందజేశారు. చెక్కపల్లిలో సర్పంచ్ రాధికా సత్యనారయణ, ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, నాయకులు అందజేశారు. అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మి సత్యనారాయణ, నాయకులు, ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరాం, తెలుగు యువత నాయకులు, గోపవరంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జియ్య, ఉపాధ్యక్షుడు పర్వతనేని శ్రీనివాసరావు, యువనేత ఉప్పలపాటి గణేష్, నాయకులు అందజేశారు. రమణక్కపేటలో పార్టీ గ్రామ అధ్యక్షులు రంగు అంజనేయులు, నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు, నాయకులు, లోపూడిలో పార్టీ అధ్యక్షులు వేంపాటి శ్రీనివాసరావు, కాట్రేనిపాడులో సర్పంచ్ సుహాసిని మోహన్‌రావు, ఎంపీటీసీ నాగమంజుల శ్రీనివాస రావు తదితరులు పెన్షన్ నగదు, స్వీట్లును లబ్ధిదారులు అందజేశారు. పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి పరిశీలించారు.

చాట్రాయి: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్లను, మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి శ్రేణులు పండుగా వాతావరణంలో లబ్ధిదారులకు పంపిణీ చేశాయి. ఉదయం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, మంత్రి పార్థసారథి చిత్ర పటాలకు కూటమి నాయకులు పాలాభిషేకం చేసి పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు. పెన్షన్లు రూ. 7 వేలు ఇవ్వటంతో లబ్ధిదారులు ఆనందానికి అవధుల్లేవు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి శ్రీనివాసరావు, మండల నాయకులు ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో మంగా కుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఆగిరిపల్లి మండలంలో పండుగ వాతావరణం సృష్టించింది. ఉదయం 6 గంటలకు బాజా భజంత్రీలతో, బాణసంచా కాల్పులతో సచివాలయం నుంచి పింఛన్ పంపిణీకి బయలుదేరిన పార్టీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ స్తూపం వద్ద ఎన్టీఆర్ చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, సచివాలయ ఉద్యోగులతో కలసి పింఛన్లు పంపిణీ చేపట్టారు. వట్టిగుడిపాడులో పిన్నిబోయిన చింతారావు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మంత్రి సారథి చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేసి దళితవాడలో పెన్షన్ పంపిణీ చేసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో...

కైకలూరు: సోమవారం పెన్షన్ల పండుగను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండే గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధుల ఇళ్ళ వద్దే పెన్షన్ సచివాలయ సిబ్బంది అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. కైకలూరు మండలంలో 95శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. ఉదయం నుంచి సుమారు 3 గంటలు సాంకేతిక లోపం తలెత్తడంతో పెన్షన్ పంపిణీ నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆ సమస్యను పరిష్కరించడంతో 95 శాతం పూర్తి అయినట్లు ఎండీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రి వెనుక కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, పోలవరపు లక్ష్మీరాణి, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, పూల రామచంద్రరావు, పడమటి వాసు, పలు గ్రామాల్లో బలే ఏసురాజు, గంగుల ఏసురాజు, నర్సిపల్లి అప్పారావు, వేములపల్లి కారుణ్య, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు, కైకలూరు పంచాయతీ సర్పంచ్ నవరత్నకుమారి పంపిణీలో పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సోమవారం ముదినేపల్లి మండలంలో కోలాహలంగా జరిగింది. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ములకలపల్లిలో తెలుగు రైతు నాయకుడు బొప్పన సుందర రామయ్య ఆధ్వర్యంలో పెన్షనర్లకు నగదు అందించటంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. పెన్షన్ల సొమ్మును పెంచినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ అల్లూరులో తెలుగుయువత నాయకుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పెన్షనర్లు పాలాభిషేకం చేశారు. మండలంలో సోమవారం 94 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో ఎస్.మురళీ గంగాదరరావు తెలిపారు.

మండవల్లి: రూ. 7 వేల పెన్షన్ అందుకోవడంతో పెన్షన్‌దారుల మోములో ఆనందం వెల్లివిరిసింది. మండలంలో సోమవారం పెన్షన్ సొమ్మును కూటమినాయకులతో కలసి అధికారులు లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ఇంగిలిపాకలంకలో కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ బాబి ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేయగా మండవల్లి బీసీ కాలనీలో పెన్షన్ అందజేశారు. ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మీ, కూటమి నాయకులు పాల్గొన్నారు. కానుకొల్లులో ముదినేపల్లి మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు కానుకొల్లు సర్పంచ్ గూడవల్లి కోటేశ్వరరావు పెన్షన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు.

కలిదిండి: కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పింఛన్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు పింఛన్లను 4,408 కోట్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి, కూటమి నాయకులు చిట్టూరి రవీంద్ర, యార్లగడ్డ రవికుమార్, లంకా రత్నారావు, నల్లగోపుల చలపతిరావు, పేటేటి సత్యనారాయణ, తట్టుగోళ్ల నాంచారయ్య, ఎంపీడీవో దినతేజ్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



మండవల్లి మండలం ఇంగిలిపాకలంకలో పెన్షన్ పంపిణీ



ముదినేపల్లి మండలంలో పింఛన్ల పంపిణీ



కలిదిండిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆగిరిపల్లిలో పెన్షన్ పంపిణీ



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏరియా ఆసుపత్రిలో డాక్టర్స్ డే

నూజివీడు టౌన్, జూలై 1: వైద్యుడు భగవంతునితో సమానమని అందుకే వైద్యో నారాయణో హరి అన్న నానుడి ఉందని నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్ అన్నారు. డాక్టర్స్ డేని పురస్కరించుకుని నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వైద్యులను సోమవారం సత్కరించారు. వైద్యులు డాక్టర్ పద్మజారాణి, డాక్టర్ హెలీన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు.

వంట గ్యాస్ ఈకేవైసీ ప్రతి గ్రామంలో నిర్వహించాలి

చాట్రాయి, జూలై 1: వంట గ్యాస్ కనెక్షల ఈకేవైసీ మండల కేంద్రంలో మాత్రమే చేయటం వలన వినియోగదారులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని, ప్రతి గ్రామంలో ఈకేవైసీకి ఏర్పాట్లు చేయాలని కోరుతూ మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసంలో తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీకి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలో 18 గ్రామాల నుంచి ఈకేవైసీ చేయించుకోటానికి చాట్రాయి రావటానికి రవాణా సౌకర్యం లేక మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్యాస్ కంపెనీ వద్ద కనీసం టెంటు గాని కుర్చీలు గాని లేకపోవటంతో మహిళల అవస్థలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి ఐదు అర్జీలు

నూజివీడు టౌన్, జూలై 1: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఐదు అర్జీలు దాఖలైనట్లు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమయి తెలిపారు. సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో ప్రధానంగా రెవెన్యూ సమస్యల పై అర్జీలు దాఖలు అయ్యాయని, సంబంధిత శాఖాధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా ఆమె కోరారు.

చెరువుగట్టుపై భవన నిర్మాణాన్ని ఆపండి

కైకలూరు, జూలై 1: మంచినీటి చెరువుగట్టుపై అంగన్వాడీ స్కూల్ భవనం నిర్మాణం చేయడం వలన మంచినీరు కలుషితమవడమేగాక పిల్లల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని తక్షణమే భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని అటపాక గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ పోతురాజుకు అటపాక గ్రామస్థులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. రక్షిత మంచినీటి చెరువుగట్టుపై గతంలో ఎన్టీఆర్ సుజలధార పథకం ఉండేదని ఆ భవనం శిధిలమైందని మరలా సుజలధార పథకం కడుతున్నామని తప్పుదారి పట్టించి వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీ భవన నిర్మాణాన్ని చేపడుతు న్నారన్నారు.తక్షణమే భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని అటపాక గ్రామస్థులు కడిమి శివబాబు, కడిమి రాము, చిల్లిముంత శ్యామలరావు, చిల్లిముంత బాలాజీ, సీహెచ్. ప్రసాదు, రవి, నాగమల్లేశ్వరరావు, పాండురంగారావు తదితరులు డిమాండ్ చేశారు.

క్రైం సమాచారం

విద్యార్థిని బలి తీసుకున్న బెట్టింగ్‌లు

ఆగిరిపల్లి, జూలై 1: ఆత్మహత్యాయత్నం చేసిన ఆగిరిపల్లిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల మూడవ సంవత్సరం చదువుతున్న నూజివీడుకు చెందిన పి. తేజ (23) అనే విద్యార్థి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడి స్నేహితుని వద్ద అప్పుచేసి అది తీర్చలేక, తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే బాధపడతారని గత నెల 27న పురుగుల మందు తాగాడు. విజయవాడ ఆస్పత్రిలో చేర్చారు. నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ముదినేపల్లి, జూలై 1 : కొరగుంటపాలేనికి చెందిన వెంట్రపాటి లవకుశరావు భార్యతో కలసి 15 రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. గత నెల 30న ఇంటి తాళాలు పగులకొట్టి ఉండటం చూసిన స్థానికుడు కమ్మెల శ్రీనివాసరావు సమాచారాన్ని లవకుశ రావుకు ఫోన్ చేసి చెప్పాడు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి వచ్చిన లవకుశరావు తన ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించి సోమవారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ వెంకట్ కుమార్ పరిశీలించి 1500 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు కనుగొన్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.



కైకలూరులో డయేరియాపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



కలిదిండిలో డయేరియాపై అవగాహన ర్యాలీ

అవగాహనతోనే డయేరియా నిర్మూలన

చాట్రాయి, జూలై 1: ప్రజలు అవగాహనతో ముందు జాగ్రత్తలు పాటిస్తే డయేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చునని ఎంపీడీవో మంగా కుమారి, తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీ అన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు జరిగే స్టాప్ డయేరియా కార్యక్రమంపై స్థానిక పీహెచ్‌సీలో సోమవారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీనివాసరెడ్డి, జ్యోతి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, శరీర శుభ్రత, కాచి చల్లార్చిన నీరు తాగటం, వేడి ఆహార పదార్థాలు తింటే డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. ఎవరికైనా డయేరియా లక్షణాలు కన్పిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని, లేదా పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి జనసేన, బీజేపీ నాయకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు: డయేరియా పట్ల ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలు వాటి బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో సీతనపల్లి, కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వీటి నిర్వహణ జరగాలని వీటిలో వైద్య సిబ్బంది ప్రముఖ పాత్ర పోషించి డయేరియా బారిన ప్రజలు పడకుండా అవగాహన కల్పించాలన్నారు. అతిసార వ్యాధి బారిన పడి కొన్ని చోట్ల మరణాలు కూడా సంభవిస్తున్నాయని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా డయేరియాపై పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్యాధికారులు బి. శంకర్, కిరణ్, అన్నపూర్ణ, అనుపమ, సీడీపీవో దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైద్యాధికారి జాహ్నవి, హెల్త్ ఆఫీసర్ కిషోర్, ఎంపీటీసీ నీలి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగీకి చెక్..

ముసునూరు: డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వలు లేకుండా ఉంటే దోమలను నివారించవచ్చన్నారు. తీవ్ర జర్వం, తలనొప్పి, కీళ్ళు, కండరాలు నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలకు రావాలని, పరీక్షలు నిర్వహించి చికిత్సను అందించడం జరుగు తుందన్నారు. ఈ నెల 31వతేదీ వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అతిసార నిలుపుదల కేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ర్యాలీలో పీహెచ్ఎన్ రత్నకుమారి, ఎం పీహెచ్ఎస్ మురళీమోహన్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కైకలూరు, జూలై 1: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్ తెలిపారు. సోమవారం కైకలూరు మండలం ఆటపాక శ్రీచైతన్య స్కూల్లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి వెంబడి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు మొక్కలను ఉచితంగా బహుకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. మొక్కలు వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఏవో పి దానయ్య, సిబ్బంది పి నరేష్‌కుమార్, బాబు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవికి సత్కారం



ముదినేపల్లి, జూలై 1 : రాజధాని నిర్మాణానికి పొలం అమ్మి రూ.25 లక్షల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేసిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవిని గురజ గ్రామ టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం ముదినేపల్లిలోని ఆమె నివాసంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి అడుసుమిల్లి రామకృష్ణ, కూటమి నాయకులు వైష్ణవిని, ఆమె తండ్రి డాక్టర్ మనోజ్‌ను సత్కరించి అభినందించారు.

ఎమ్మెల్యే కామినేనికి సత్కారం



కైకలూరు, జూలై 1: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను అటపాక కనకలింగేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులైన బందా సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలసి ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాదులో కామినేని స్వగృహంలో యశోద హాస్పిటల్స్ చీఫ్ డాక్టర్ బందా బాలరాజుతో కలిసి కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి మరింత కృషి చేసి ప్రజలకు దర్శన సౌకర్యాలను పెద్దఎత్తున కలిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరినట్లు బందా సత్యనారాయణ తెలిపారు.

పెదలంకలో స్వచ్ఛభారత్

కలిదిండి, జూలై 1: పెదలంకలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా సోమవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ ఆవరణలో దట్టంగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ముద్దం భోగేశ్వరరావు, నాయకులు దున్న భోగేశ్వర రావు, వెంకన్న బాబు, జనసేన నాయకుడు ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ వితరణ

ఆగిరిపల్లి, జూలై 1: నెక్కలం గొల్లగూడెం గ్రామంలో గల చుక్కపల్లి హైస్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 25 వేల నగదు బహుమతి అందించారు. టెన్త్‌లో జ్ఞానహారిక 589/600, సుశాంత్‌కుమార్ 584/600, తేజశ్రీ 583/600, ఎం.దీక్షిత 582/600, జగదీశ్వరి 581/600కి నగదుతో పాటు రూ.2 వేలు విలువ కలిగిన వాచీలు కూడా బహూకరించారు. ఇవ్వడం జరిగింది. దాతలు నూతక్కి కిషన్, హేమలతను పాఠశాల సెక్రెటరి, కరస్పాండెంట్ సుధారాణి, ప్రిన్సిపల్ ప్రభాకర్ శర్మ అభినందించారు.



ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు ప్రారంభం

నూజివీడు టౌన్, జూలై 1: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌కు అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం నుంచి ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్రకుమార్ ప్రారంభించారు. తొలి విడతగా ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనిక సంతతి విభాగానికి సంబంధించి తొలిరోజు 48 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సైనిక సంతతి విభాగం కేటగిరీలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

హామీలు నెరవేరుస్తాం : మంత్రి సారథి

నూజివీడు టౌన్, జూలై 1: ఎన్నికల సమయంలో నూజివీడు పట్టణ అభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని, రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో గాంధీనగర్‌లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హామీ మేరకు తొలుత టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడతానన్నారు. నూజివీడు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు, డ్రైనేజి, రోడ్ల నిర్మాణాన్ని దశలవారీగా చేపడతామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 11 కోట్లతో పైప్‌లైన్ల మరమ్మత్తులు, నూతన లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నూజివీడు ఇన్‌చార్జ్ ఆర్డీవో ముక్కంటి, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, మల్లిశెట్టి జగదీష్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రహదారి బాగుచేయరూ..

నూజివీడు టౌన్, జూలై 1: నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి ఎస్సీ శ్మశాన వాటికకు సరైన రహదారి లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇచ్చారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి దృష్టికి సీపీఐ నాయకులు గ్రామ సమస్యలను తీసుకువచ్చారు. సీపీఐ నాయకులు రాజా, టీడీపీ నాయకులు అక్కినేని చందు, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

నూజివీడు, జూలై 1: పింఛన్ల పంపిణీలో తెలుగుదేశం కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడిచేయడంతో ముగ్గురు గాయపడ్డారు. నూజి వీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో టీడీపీ కార్యకర్తలు నంద్యాల పంగిడయ్య, బత్తుల పద్మ, వాసుపై తురకా శ్రీనుతో పాటు పలువురు దాడిచేయడంతో టీడీపీ కార్యకర్తలు గాయ పడ్డారు. దీంతో క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించగా పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య దాడులు జరిగినట్లు నూజివీడు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా బ్రిడ్జి కోర్సు

కైకలూరు, జూలై 1: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిడ్జి కోర్సుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే సుజాత అన్నారు. సోమవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల్లో ఈ విద్యాసంవత్సరంలో రసాయనశాస్త్రం మేజర్‌గా ఎంచుకున్న వారికి బ్రిడ్జి కోర్సును ప్రారంభించారు. ఇంటర్ పూర్తయి రెండు నెలలుగా విద్యార్థులు ఖాళీగా ఉంటున్నందున బ్రిడ్జి కోర్సులు కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి సబ్జెక్టులకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలను నేర్చుకోవాలని సూచించారు. బ్రిడ్జికోర్సుకు ఫీజులు లేవని పూర్తి ఉచితంగా అడ్మిషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ కోర్సును విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.